క్లుప్తంగా

విజయవంతం చేయాలి

రఘునాథపల్లి: ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ వై. కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభ జయప్రదం కోసం మండలంలోని 36 గ్రామాలకు ఆరు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మండలం నుంచి 5 వేల మందిని తరలించనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, నాయకులు గూడ కిరణ్, లొక్కుంట్ల సృజన్, కొర్ర రాజేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నాగిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాతారెడ్డి భవానిశశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గ్రామంలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని..



పాలకుర్తి టౌన్: ఈనెల 21వ తేదీన సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌హాల్‌లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీకి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ మొలుగూరి యాకయ్యగౌడ్, రాష్ట్ర కార్యదర్శి నలమాస రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ప్లీనరి వాల్‌పోస్టర్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ ఆవిష్కరించారు.

జఫర్‌గఢ్: తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రడపాక డానియల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

బహిరంగ సభను..

జనగామ రూరల్: మహిళా హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా నేడు (శనివారం) పట్టణంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పందిళ్ల కల్యాణి, బండ రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద 11:00 గంటలకు నిర్వహించే సభకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లు లక్ష్మి ,అరుణ జ్యోతి, ఆశాలత, బుగ్గ వీటి సరళ, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నారని తెలిపారు.

నియామకం

జనగామ రూరల్: బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా జాయ మల్లేష్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్ నియామక పత్రాన్ని మల్లేష్‌కు అందజేశారు. పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42శాతం రిజర్వేషన్ అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, సలెంద్రీ శ్రీనివాస్,మోర్తాల ప్రభాకర్, దేవర సత్యం, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జనగామ రూరల్: పట్టణంలోని వడ్లకొండ రోడ్డులో ఉన్న జయదుర్గ అమ్మవారి 11వ వార్షికోత్సవం, రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల సతీష్, ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్ శుక్రవారం ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బైరు బాబు, రంగా నరసింహులు, దుసరి లక్ష్మయ్య, ఇట్టబోయిన కుమార్, రంప సత్యం, లోలకుపూరి, శ్రీధర్, దూసరి భాస్కర్ ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

దేవరుప్పుల: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉప్పల మల్లన్న జాతరలో శివపార్వతుల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. స్థానిక భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలోని ఐదుర్లాళ్ల ఏరియాలో పద్మశాలీలు ఎదురుకోళ్లు నిర్వహించిన అనంతరం బ్రహ్మశ్రీ శానగొండ శివకిరణ్‌శర్మ పర్యవేక్షణలో పెద్దాపురం వెంకటేశ్వర శర్మ తదితర దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున అగ్ని గుండాల కోసం ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.

అంధకారంలో జాతీయ రహదారి

- నిడిగొండలో వెలగని లైట్లు
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నిర్లక్ష్యం



నిడిగొండలో జాతీయ రహదారిపై వెలగని లైట్లు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 15 రోజులుగా లైట్లు వెలగడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వీస్ రోడ్డుకు ఇరు వైపులా ఉన్న లైట్లు మరమ్మతులకు గురై వెలగడం లేదు. దీంతో చీకట్లు కమ్ముకోవడంతో ప్రజలు సర్వీస్ రోడ్డు గుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా శ్రీమన్నారాయణపురం, ఫతేషాపూర్ క్రాస్ రోడ్డు, యూటర్న్‌ల వద్ద కొన్ని లైట్లు వెలగడం లేదు. దీంతో వాహనదారులు రాత్రి పూట పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే లైట్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫతేషాపూర్‌లో ఎస్సై దూదిమెట్ల నరేష్‌తో కలిసి రహదారి భద్రత, డ్రంకెన్‌డ్రైవ్, సైబర్ నేరాలు, గుట్కా తినడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బెల్ట్ నిర్వాహకులను పిలిచి గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురికావొద్దని, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపొద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

ఎంపీని, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు హనుమకొండలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరిని మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటయ్య, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సందీప్, కార్తీక్, జీవన్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీరాములు

పాలకుర్తి టౌన్: జాతీయ అగ్నిమాపక భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ సిస్టంపై పాలకుర్తి అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాద నివారణ, భద్రత చర్యలు వివరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదలు నివారణపై అవగహన కరపత్రలు పంపిణీ చేశారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రామయ్య, నాగరాజు, అశోక్, ప్రశాంత్, ప్రదీప్‌కుఆర్, మహేందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: పిడుగు పాటు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బచ్చన్నపేట మండలం ఆలింపూర్ గ్రామ చివరన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం పిడుగు పాటుకు గాయపడి జనగామ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్య సేవలకు, వసతుల విషయంలో ఇబ్బందులుంటే తమ నీలిమ ఆస్పత్రికి తరలించి సేవలందిస్తామని చెప్పారు. ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే వెంట ఇర్రి రమణారెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పలువురు ఉన్నారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ నాయకులు నూకల బాల్‌రెడ్డి తదితరులు కూడా క్షతగాత్రులను పరామర్శించారు.

అధైర్యపడకూడదు : ఆర్డీఓ గోపీరాం

పిడుగుపాటుకు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆర్డీఓ గోపీరాం పరామర్శించారు. అందరి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్న తర్వాత ఆయన మాట్లాడుతూ.. అధైర్యపడొద్దని, డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించినట్లు చెప్పారు. ఆయన వెంట పొరసరఫరాల తహసీల్దార్ శ్రీనివాస్, నాయక్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా సిలువ మార్గంలో ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిల్లో యేసుప్రభును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యేసుక్రీస్తు జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని, ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ఫాదర్లు, క్రైస్తవ సంఘం పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: సిలువ మార్గంలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



స్టేషన్‌ఘన్‌పూర్: సిలువ మోస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



చిల్పూరు: మల్కాపూర్‌లో..



కొడకండ్ల: సీఎస్‌ఐ చర్చిలో..



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో యేసుకీస్తు సిలువ యాత్ర

క్రషర్‌కు విద్యుత్ లైన్ ఇవ్వొద్దని రైతుల నిరసన

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ శివారులో అనంత రాయి గుట్టకు ఉన్న క్రషర్‌కు 11 కేవీ విద్యుత్ లైన్ పనులు కొనసాగుతుండగా శుక్రవారం గ్రామ రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఇబ్రహీంపూర్ ఫీడర్ నుంచి 11 కేవీ విద్యుత్ లైన్‌కు కాంట్రాక్టర్ ట్రాక్టర్‌తో స్తంభాలు నాటేందుకు యత్నిస్తుండగా సమాచారం అందుకున్న రైతులు పనుల వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా క్రషర్ యజమాని, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది, రైతులు మాట్లాడుతూ ఇబ్రహీంపూర్ ఫీడర్‌కు ఇప్పటికే ఓవర్‌లోడ్ ఉందని.. సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

విరాళం



ఆర్థికసాయం అందజేస్తున్న విద్యానాథ్

బచ్చన్నపేట: పడమటికేశ్వాపూర్ గ్రామంలో మల్లన్న ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు జంగిటి విద్యానాథ్ రూ.50వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. యాదవ సంఘం నాయకులు సోములు, సంతోష్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, నర్సయ్య, నర్సింహ, శివ, రాములు, బాలయ్య, రాజయ్య, బాలమల్లు, రాజు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న గీత కార్మికులు తదితరులు

జనగామ రూరల్: నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలను నిషేధించి, చట్టపరమైన చర్యతీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కల్లుగీత కార్మిక సంఘం, సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా గుడి నుంచి గెంటివేసి, గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. కల్లుగీత కార్మికుల సాంఘిక బహిష్కరణను ఎత్తివేయాలని అన్నారు. ఈనెల 25వ తేదీన తలపెట్టిన చలో తాళ్లరాంపూర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, గోపా రాష్ట్ర నాయకుడు కన్నా పరశురాములు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం గద్దం యాదగిరి, ఎండి షబానా, రమావత్ మిట్యానాయక్ , కొలిపాక నరసింహులు బొమ్మ కంటి అనిల్ కుమార్, రాజా సంపత్, సుగుణాకర్,మార్క ఉపేందర్ రాజేష్, అంజయ్య,వెంకటేష్, శ్రీధర్, ఉమాపతి పాల్గొన్నారు.

పరామర్శ



జనగామ: పట్టణంలోని 20వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు జూకంటి శ్రీశైలం సోదరుడు యాదగిరి కుమారుడు మనీష్ శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు.

కడియం కుటుంబం జోలికొస్తే ఊరుకోం



విలేకరులతో మాట్లాడుతున్న రాంబాబు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్: కొందరు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నేతలు అగ్రకుల అహంకారంతో, ధనబలంతో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై, అతని కుటుంబంపై కారు కూతలు కూస్తున్నారని, మరోసారి విమర్శలు పునరావృతమైతే ఊరుకునేది లేదని, గ్రామాల్లో తరిమి కొడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుడోజు రాంబాబు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. ఇటీవల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తగుదునమ్మా అంటూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేస్తూ కడియం శ్రీహరి కుటుంబాన్ని విమర్శించడమే లక్ష్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పలు అవినీతి, అక్రమాలకు పాల్పడిన కొందరు.. నీతి, నిజాయితీపరుడైన కడియంపై, ఆయన కుటుంబంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. దేవునూరు భూముల అవినీతి ఆరోపణలపై రుజువు చేస్తే గులాంగిరీ చేస్తానని కడియం సవాల్ చేసినా స్వీకరించకుండా దళితనేతపై అసత్యపు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, నాయకులు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, కొలిపాక సతీష్, నూకల ఐలయ్య, సింగపురం వెంకటయ్య, గడ్డమీది సురేష్, నాగరబోయిన యాదగిరి, శ్రీరాములు, తోట సత్యం, గుర్రం ఫాతికుమార్, కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, రాఘవరెడ్డి, జానీషాషా, చరణ్‌రెడ్డి, వసంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో చేపల వేట..



బతుకమ్మకుంటలో చేపలు పడుతున్న వాకర్లు, యువకులు

జనగామ: సుందరీకరణ పనుల్లో భాగంగా పట్టణంలోని బతుకమ్మ కుంటలోని నీటిని బయటకు పంపిస్తున్నారు. కుంటలో సంవత్సరాల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాస వెదజల్లుతోంది. దీంతో వాకర్లు, సేదదీరేందుకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'సాక్షి'లో గత నెల ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా.. కుంట అభివృద్ధికి పురపాలిక నుంచి రూ.1.50కోట్లు వెచ్చించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పనులకు టెండర్లు పూర్తి కావడంతో.. కుంటలోని నీటిని తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. ఏళ్ల తరబడి కుంటలో జీవించే అనేక రకాల చేపలు నీటి నిల్వ తగ్గడంతో పైకి వచ్చాయి. శుక్రావారం వాకర్లు, యువకులు కుంటలోకి దిగి వాటిని పట్టుకుని ఇళ్లకు తీసుకెళ్లారు. కుంటలోని నీరు రెండు రోజుల్లో పూర్తిగా ఖాళీ కానుంది.

క్రైం కార్నర్

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

దేవరుప్పుల: భర్త మద్యానికి బానిసకావడంతో మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కడవెండిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. కడవెండికి చెందిన రుషగాని అజయ్‌కి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మలక్‌పల్లికి చెందిన సోని(25)ని ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపారు. వీరి అన్యోన్య దాంపత్యానికి కొడుకు జన్మించాడు. ఇదే క్రమంలో భర్త మద్యానికి బానిసై తిరుగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని తమ తల్లిదండ్రులకు సోని చెబుతూ బాధపడుతూ ఉండేది. ఇదే క్రమంలో గురువారం ఉదయం అజయ్ మద్యం సేవించి ఇంటికి రావడంతో సోని జీవితంపై విరక్తిచెంది సాయంత్రం దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని చూసిన అజయ్ నానమ్మ రాధమ్మ పరిసరాల వ్యక్తులకు చెప్పడంతో ప్రథమ చికిత్స కోసం జనగామలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. అదే రాత్రి 10.30గంటలకు చికిత్స పొందుతూ సోని మృతి చెందింది. ఈ విషయమై మృతురాలి తండ్రి సాంబరావు తన కూతురు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంలో వృద్ధురాలి..

రఘునాథపల్లి: విద్యుదాఘాతంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఖిలాషాపూర్‌లో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావటి ఉప్పలయ్యకు రెండు ఇళ్లు ఉన్నాయి. ఒక ఇంట్లో భార్యాపిల్లలతో ఉండగా, మరో ఇంట్లో తన తల్లి కొమురమ్మ (70)ఉంటోంది. ఉప్పలయ్య తల్లి యోగక్షేమాలు తెలుసుకునేందుకు నిత్యం వచ్చి వెళ్లేవాడు. మూడు రోజులు పని ఒత్తిడితో తల్లి వద్దకు వెళ్లలేక పోయాడు. గురువారం తల్లి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు ఉప్పలయ్యకు సమాచారం అందించారు. ఆయన వెళ్లి చూడగా విద్యుదాఘాతంతో తల్లి శవమై కనిపించింది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యుదాఘాతం కారణంగా తల్లి మృతి చెందినట్లు ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి. నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నర్మెట: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు అయిన సంఘటన మండలంలోని బొమ్మకూర్ గ్రామం వద్ద శుక్రవారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి సిమెంటు బస్తాలతో పలువురు ప్రయాణికులను ఎక్కించుకుని బొమ్మకూరు వెళ్తున్న ఆటోను హన్మంతాపూర్ ఐకేపీ సెంటర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పాలేపాక లక్ష్మయ్యకు తీవ్ర గాయాలు కాగా భిక్షపతికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మేడేను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కనకారెడ్డి

పాలకుర్తి: మేడే విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శుక్రవారం పాలకుర్తిలోని చిట్యాల ఐలమ్మ స్మారక భవనంలో ఏదునూరి మదార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కనకారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఊరూరా సీపీఎం, సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల జెండాలు ఆవిష్కరించాలని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు సోమన్న, మండల కార్యదర్శి సారయ్య, నాయకులు సత్యం, ఇంద్రారెడ్డి, సంపత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల వద్దకు 'బడి బాట'



మాధాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

దేవరుప్పుల : ప్రైవేట్ పాఠశాలల నుంచి పోటీని తట్టుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు చేపట్టిన 'బడి బాట' ఉపాధి పనుల వద్దకు చేరింది. మండల పరిధి మాధాపురంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నల్ల లలిత, వీరగోని రమేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం వినూత్నంగా బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, కల్పిస్తున్న సదుపాయాలతోపాటు తమ స్కూల్‌లో చదివిన విద్యార్థులు సాధించిన ఫలితాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమరాజు, సూర్జిత్, జీవన్, మాధవి, అశోక్, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న పోలీసులు

దేవరుప్పుల: ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి అర్ధరాత్రి ముళ్లపొదల్లో పడితే గుర్తించి సదరు వ్యక్తిని వెతికి అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్‌లో పంపి మానవత్వం చాటుకున్నారు మండల పోలీసులు. వివరాల్లోకి వెళ్తే.. చౌడూరు పరిధిలో ఇదే గ్రామానికి చెందిన మైల అనిల్ గురువారం అర్ధరాత్రి 1:45 నిమిషాలకు ద్విచక్రవాహనాన్ని అతివేగంతో నడుపుతూ అదుపు తప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. ఇదే క్రమంలో స్థానిక ఎస్సై ఊర సృజన్ కుమార్ పెట్రోలింగ్ చేసే క్రమంలో రోడ్డుపై పడి ఉన్న వాహనాన్ని చూసి అనుమానం వచ్చి పరిసరాల్లో పరిశీలించగా క్షతగాత్రుడు తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. వెంటనే అనిల్‌కు అత్యవసర వైద్య చికిత్స అందించేందుకు అంబులెన్స్‌ను పిలిపించి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అర్ధరాత్రి బాధితుడిని ప్రాణాపాయం నుంచి తప్పించిన పోలీసుల తీరును గ్రామస్తులు ప్రశంసించారు.

కేసీఆర్ పాలనలోనే ఆలయాల పునరుద్ధరణ

- మాజీ మంత్రి దయాకర్‌రావు



మొక్కులు చెల్లిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: కేసీఆర్ పరిపాలనలోనే తెలంగాణ ప్రాంత పురాతన ఆలయాల పునరుద్ధరణతో అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో దొంత నర్సయ్య జ్ఞాపకార్థం రూ.3.5 లక్షలతో పంచముఖ హనుమాన్ ఆలయం నిర్మించగా గోలి యాదవరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ. 2 లక్షలతో విగ్రహాలు ఏర్పాటు చేశారు. అలాగే కాసారపు సుగుణమ్మవీరారెడ్డి, మునగాల కమలమ్మమల్లయ్య జ్ఞాపకార్థం గణపతి, నందీశ్వరస్వామి విగ్రహాలు ఏర్పాటు చేయగా ఆలయ పూజారి పెద్దాపురం వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠింపజేశారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి దోహదపడిన నిర్వాహకులు, దాతలను దయాకర్‌రావు సన్మానించి అభినందించారు.